క్లుప్తంగా

నూతన వధూవరులకు ఎమ్మెల్యే సింహాద్రి ఆశీర్వాదం



అవనిగడ్డ: అవనిగడ్డ డీఎస్పీ పి. మురళీధర్ కుమార్తె అనూష–సుధాకర్ వివాహం ఇటీవల జరిగింది. నూతన వధూవరులను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆయన సతీమణి కెప్టెన్ లక్ష్మీ బుధవారం ఆశీర్వదించారు. విజయవాడలోని డీఎస్పీ స్వగృహంలో నూతన వధూవరులను ఎమ్మెల్యే సింహాద్రి దంపతులు కలుసుకుని ఆశీస్సులు అందించారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్‌పై ఆడిట్‌కు సిద్ధంకండి

పెడన: ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆడిట్‌కు సిద్ధంకావాలని పెడన ఏపీఓ ముత్యాలు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 2022–23 ఏడాదికి సంబంధించి 1,517 పనులు జరిగాయని, ఇందుకు రూ.8.31 కోట్లకు సంబంధించిన పనులు, వ్యయం పరిశీలన నిమిత్తం ఆడిట్ చేసేందుకు సిబ్బంది వస్తున్నారని చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది కచ్చితమైన నివేదికలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఒకటి, రెండు రోజుల్లో షెడ్యూల్ వస్తుందని, ఆ షెడ్యూల్ ప్రకారం ప్రతి గ్రామంలో ఆడిట్ సిబ్బంది గ్రామ సభలు నిర్వహించి పరిశీలిస్తారని చెప్పారు. పనులకు సంబంధించిన క్షేత్ర స్థాయిలో నేమ్‌బోర్డులు, రిజిస్టర్ పుస్తకాలు అన్నీ సక్రమంగా ఉంచి ఆడిట్ సిబ్బందికి చూపాలని ఏపీఓ ఆదేశించారు.

10న గ్రీన్ కార్నివాల్

అవనిగడ్డ: గ్రీన్ కార్నివాల్ కార్యక్రమం ఈ నెల 10వ తేదీన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తామని సర్వజన స్నేహ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సిస్టర్ సుగుణ ఫ్రాన్సిస్ తెలిపారు. సెయింట్ ఆన్స్ సంస్థ కొన్ని దశాబ్దాలుగా ప్రజా సంక్షేమ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. అందులో భాగంగానే పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటించి వాటిని సంరక్షించేలా ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు.

అగ్ని బాధితులకు సాయం



అవనిగడ్డ: ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో కట్టుబట్టలతో మిగిలిన సూరగం నాగమల్లి, కేసన కృష్ణకుమారి కుటుంబాలకు శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాం కిశోర్ నాయుడు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున బాధితులకు శ్యాంకిశోర్ నాయుడు అందజేశారు. కార్యక్రమంలో చెన్ను బాబూరావు, కర్రా శాంతయ్య, బచ్చు శ్రీనివాసరావు, చెన్ను వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

11 నుంచి ఆటల పోటీలు

కైకలూరు(కలిదిండి): ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి కలిదిండి మండల స్థాయి ఆటల పోటీలు, 14వ తేదీ నుంచి నియోజకవర్గ ఆటల పోటీలు కలిదిండి మండలం ఆరుతెగలపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఆటల కార్యనిర్వహణాధికారి పి.లూయిస్ బుధవారం తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కబడ్డీ, బాల్ బాడ్మింటన్, వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, ఖోఖో, యోగా, అథ్లెటిక్స్ అంశాలలో పోటీలు జరుగుతాయన్నారు. కలిదిండి మండలానికి సంబంధించి ఈ నెల 11న బాలురు, 12న బాలికలు, 13న స్పోర్ట్స్ నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గ స్థాయిలో 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు బాలబాలికలకు ఎంపికలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 97018 34513 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కలిదిండి పీడీలు మావుళ్లేశ్వరరావు, బి.కృష్ణకుమారి, కె.రత్నదాసు, ఎం.వెంకటేశ్వరరావు, టి.కీర్తి కాంత్ పాల్గొన్నారు.

వినూత్న రీతిలో ప్రకృతి వ్యవసాయం



వేములమడ(మొవ్వ): ఏటీఎం విధానం ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబిస్తూ నాణ్యమైన మంచి పోషకాలు కలిగిన కాయగూరలు, ఆకు కూరల సాగుకు మొవ్వ మండలం వేములమడలో రైతులు శ్రీకారం చుట్టారు. ప్రకృతి వ్యవసాయం మెంటర్ గొంగి పోతలయ్య పర్యవేక్షణలో బుధ వారం 20 సెంట్ల భూమిలో ఏటీఎం పద్ధతి ద్వా రా ఆకుకూరలు, కూరగాయలు, తీగ జాతి, దుంప జాతి నిరంతరం ఆదాయం వచ్చే విత్తనాలను రైతులు నాటారు. ప్రకృతి వ్యవసాయ రైతులు, ఫార్మర్ సైంటిస్టులు, రైతులు పాల్గొన్నారు.

నూతన ఒరబడి



గొడుగుపేట ఎలిమెంటరీ స్కూల్ (ఆర్)



డ్రైవర్స్‌కాలనీలోని ఎలిమెంటరీ స్కూల్

సర్కార్ బడులకు మంచి రోజులు
- నాడు–నేడుతో మారుతున్న రూపురేఖలు
- బందరు నియోజకవర్గంలో రూ. 34.03 కోట్లతో అభివృద్ధి
- సమకూరిన మౌలిక వసతులు
- విద్యార్థుల నుంచి పెరుగుతున్న ఆదరణ

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టడంతో ప్రభుత్వ పాఠశాలలకు మంచి రోజులు వచ్చాయి. మచిలీపట్నం నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న పలు ప్రభుత్వ పాఠశాలలు నాడు–నేడు పథకం అమలుతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందాయి. పాఠశాలల రూపురేఖలు మారడంతో పాటు మౌలిక సదుపాయాలు సమకూరాయి. మంచి విద్యాబోధన అందుతుండటంతో ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు సైతం ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. మచిలీపట్నం నియోజకవర్గంలోని మండలంతో పాటు నగర పాలక సంస్థ పరిధిలో అధ్వానంగా ఉన్న పలు పాఠశాలలు అభివృద్ధికి నోచుకున్నాయి. వీటిలో అదనపు తరగతి గదుల నిర్మాణం జరిగి అభివృద్ధి వైపు అడుగులు వేశాయి. పాఠశాలల అభివృద్ధితో పాటు ఆవరణలో మొక్కల పెంపకం, గోడలకు అందమైన, ఆకర్షణీయమైన బొమ్మలు వేయడంతో విద్యార్థులకు ఆహ్లాదం కలిగిస్తోంది. మధ్యాహ్న భోజనం మెనూలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా మార్పులు తీసుకురావడంతో భోజనం ఎంతో బాగుందంటూ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేసి వారిని ప్రోత్సహించారు.



డ్రైవర్స్ కాలనీలోని ఎలిమెంటరీ స్కూల్‌లో తరగతి గది

రూ. 34.03 కోట్లతో అభివృద్ధి..

నాడు–నేడు పథకంలో భాగంగా రెండు విడతల్లో మంజూరైన రూ. 34.03 కోట్లతో మచిలీపట్నం నియోజకవర్గంలోని పాఠశాలల అభివృద్ధి జరిగింది. మొదటి విడతలో రూ. 13.16 కోట్లతో నియోజకవర్గంలోని 67 పాఠశాలలను అభివృద్ధి చేశారు. 37 పాఠశాలలు మండల పరిధిలోనివి కాగా 30 పాఠశాలలు నగరంలోని మునిసిపల్ పాఠశాలల్లో అభివృద్ధి చెందాయి. ప్రహరీ నిర్మాణం, టాయిలెట్లు, తాగునీటి వసతి, ఫ్లోరింగ్, ప్రధాన ద్వారాల ఏర్పాటు వంటి పనులు నిర్వహించారు. రెండో విడత నాడు–నేడు పనులను 60 పాఠశాలల్లో చేపట్టారు. కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తికాగా మరికొన్ని పాఠశాలల్లో కొనసాగుతున్నాయి. మండలంలోని 10 అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మిస్తున్నారు. మండలంలోని 13 పాఠశాలలు, నగరంలోని ఏడు పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం జరుగుతోంది. 30 పాఠశాలల్లో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. రెండో దశలో ఇప్పటివరకు రూ. 13 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

భోజనం మెనూ బాగుంది



మారిన మెనూ ఎంతో బాగుంది. గతంలో మధ్యాహ్న భోజనం రోజూ ఒకే విధంగా ఉండటంతో తినేందుకు ఇబ్బంది పడేవాళ్లం. జగన్ మామయ్య సీఎం అయ్యాక రోజుకొక రకం వంటకాలను వడ్డిస్తుండటంతో స్కూల్‌లోనే భోజనం చేస్తున్నాం.
–పిట్ల హరీష్, విద్యార్థి, రాజుపేట యూపీ స్కూల్

పాఠశాల ఎంతో అభివృద్ధి చెందింది



గొడుగుపేట మునిసిపల్ ఎలిమెంటరీ పాఠశాల (ఆర్) ఎంతో అధ్వానంగా ఉండేది. ప్రహరీ లేకుండా శిథిలమైన రేకుల షెడ్లతో ఉండేది. దీంతో అసాంఘిక కార్యకలాపాలు జరిగేవి. స్కూల్‌కు రావాలంటే భయం వేసేది. ఆవరణ నిండా ఆవులు ఉండేవి. నాడు–నేడు పథకంలో భాగంగా మా పాఠశాల ఎంతో అభివృద్ధి చెందింది.
– పోగిరి విజయలక్ష్మి, గొడుగుపేట ఆర్ స్కూల్ ఉపాధ్యాయిని

ప్రైవేటు స్కూల్ నుంచి మునిసిపల్ స్కూల్‌కు



నేను ప్రైవేట్ స్కూల్‌లో చదివేవాడిని. డ్రైవర్స్ కాలనీలోని మునిసిపల్ స్కూల్ అభివృద్ధి చేయడంతో ఇక్కడ ఐదో తరగతిలో చేరాను. భోజనంతో పాటు విద్యా బోధన బాగుంది. ప్రైవేట్ స్కూల్ కన్నా మునిసిపల్ స్కూలే ఎంతో ఆహ్లాదంగా ఉంది. టీవీలో పాఠాలను ప్రదర్శిస్తున్నారు. దీంతో పాఠాలు అర్థమవుతున్నాయి.
– మార్కాపురం గురునాథం, డ్రైవర్స్ కాలనీ మునిసిపల్ స్కూల్

మేయర్ వెంకటేశ్వరమ్మ బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరించిన అనంతరం కేక్ కట్ చేస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర మేయర్‌గా చిటికిన వెంకటేశ్వరమ్మ బుధవారం కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ నెల 4వ తేదీన జరిగిన మేయర్ ఎన్నికల్లో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. మేయర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మేయర్‌గా నియమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)కి కృతజ్ఞతలు తెలిపారు. నగరాభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.
డెప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లతో సమష్టిగా నగరాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్‌గా తనను గెలిపించిన 43వ డివిజన్ ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. నగర కమిషనర్ జి. చంద్రయ్య, అసిస్టెంట్ కమిషనర్ బి. జ్యోతిలక్ష్మి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్ దాదా, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మాజీ డెప్యూటీ మేయర్లు తంటిపూడి కవిత, లంకా సూరిబాబు, కార్పొరేటర్లు మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు దంపతులకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

పనిచేసిన వారిని ఆదరిద్దాం

- అబద్ధాలు చెప్పే నాయకులను నమ్మవద్దు
- లక్ష్మీపురం గడప గడపలో మంత్రి జోగి రమేష్

కృత్తివెన్ను: అన్నివర్గాల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తూ సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. మండల పరిధి లక్ష్మీపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మంత్రి ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఇప్పటి వరకు అందించిన సంక్షేమాన్ని వివరించారు. భవిష్యత్‌లో జగనన్న ద్వారా జరగబోయే మేలులను తెలిపారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ కల్లబొల్లి మాటలను చెబుతూ ఎన్నికల సమయంలో ఓట్ల కోసం తలుపు తట్టే రాజకీయ నాయకుల మోసపూరిత మాటలను నమ్మవద్దన్నారు. 14 ఏళ్ల పాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు హయాంలో ఏనాడైనా పేదల సంక్షేమాన్ని పట్టించుకున్నాడా అని ప్రశ్నించారు. తీర ప్రాంతంలో ఇంతటి అభివృద్ధి మునుపెన్నడూ జరగలేదని, మరింత అభివృద్ధితో మన గ్రామాల్లో ప్రజల జీవన విధానం మెరుగుపడాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని చెప్పారు.

రైతు బాంధవుడు జగనన్న..
రైతుల పక్షపాతి, రైతు బాంధవుడు జగనన్న అని, రైతుల అభ్యున్నతికి ఆయన ఎన్నో పథకాలు అమలు చేశారని మంత్రి జోగి రమేష్ తెలిపారు. లక్ష్మీపురంలో రూ.21 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి జోగి రమేష్ ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లోని రైతులకు అన్ని వసతులు అందే విధంగా ఆర్‌బీకేల నిర్మాణంతో వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టిన గొప్ప వ్యక్తి జగనన్న అని అన్నారు.

వర్షంలోనూ అదే జోరు..
గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతున్న సమయంలో కుండపోతగా వర్షం కురిసింది. అయినప్పటికి మంత్రి జోగి రమేష్ వర్షంలోనూ ఇంటింటికి తిరుగుతూ కార్యక్రమాన్ని కొనసాగించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



జోరు వర్షంలోనూ గడప గడపలో సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్



చిన్నారి కృష్ణుడిని ఎత్తుకుని సందడి చేస్తున్న మంత్రి జోగి రమేష్

చిన్నారి కృష్ణుడితో మంత్రి సందడి..
గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా లక్ష్మీపురంలో ఇంటింటికి తిరుగుతున్న మంత్రి జోగి రమేష్‌కు ఓ ఇంటి వద్ద చిన్ని కృష్ణుని వేషధారణలో ఉన్న చిన్నారి కనిపించాడు. వెంటనే మంత్రి ఆ చిన్నారిని ఎత్తుకుని ముద్దాడి సందడి చేశారు.
కార్యక్రమంలో ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, సూపరింటెండెంట్ మధుసూదనరావు, ఎస్‌ఐ గణేష్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

పెడన: కృష్ణాష్టమి వేడుకలు పెడన, అవనిగడ్డ, మచిలీపట్నం నియోజకవర్గాల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో సందడి చేశారు. ఉపాధ్యాయులు కృష్ణాష్టమి విశిష్టతను వివరించారు. పెడన పట్టణంలోని విశ్వభారతి ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పెడన ఎస్‌ఐ వి. రవిచంద్రకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు గోపికలు, శ్రీకృష్ణుని వేషధారణలతో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ గౌరీప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. కళాంజలి హైస్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని చిన్నారులు శ్రీకృష్ణుని వేషధారణలు, బాలికలు గోపికల వేషధారణతో కోలాటం ఆడి అలరించారు. ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, కరస్పాండెంట్ ప్రసన్నలక్ష్మీ పాల్గొన్నారు.



చల్లపల్లిలో చిన్నారుల వేషధారణ



పెడన కళాంజలిలో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారుల కోలాటం

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు ప్రాంతాల్లో శ్రీకృష్ణునికి పూజలు చేశారు. గోపూజ, ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున గోవులకు పూజలు చేశారు. నగరంలోని ఇంగ్లిషుపాలెంలో పాలసాయి ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మహిళా కార్పొరేటర్లు గోపూజ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మాట్లాడుతూ మచిలీపట్నం మరింత అభివృద్ధి చెందేందుకు శ్రీ కృష్ణుని ఆశీస్సులు ఉండాలన్నారు. ఇప్పటికే మచిలీపట్నానికి పోర్టు, ఫిషింగ్ హార్బర్, మెడికల్ కళాశాల వంటి పెద్ద ప్రాజెక్టులు వచ్చాయని, మరిన్ని ప్రాజెక్టులు వచ్చేలా కృష్ణుని దయ ఉండాలన్నారు. స్థానిక బుట్టాయిపేటలోని దత్తాశ్రమంలో శ్రీకృష్ణుని ప్రతిమను ఉంచి మహిళలు పూజలు చేశారు. కృష్ణుని విగ్రహం వద్ద పారాయణ జరిగింది. అనంతరం గోపూజ నిర్వహించారు. ఆశ్రమం ప్రతినిధి శ్రీనివాస్ పర్యవేక్షించారు.



కోనేరు సెంటర్‌లో వేడుకల్లో శ్రీకృష్ణుని వేషధారి

కోనేరుసెంటర్‌లో...
స్థానిక కోనేరు సెంటరులో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురు కర్రసాముతో నైపుణ్యాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంయూడీఏ చైర్మన్ బొర్రా దుర్గాభవానీ, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా పాల్గొన్నారు.

చల్లపల్లి: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం సందడిగా జరిగాయి. భక్తులు తమ గృహాల్లో శ్రీకృష్ణుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసుకుని దేవాలయాలను దర్శించారు. తమ చిన్నారులకు శ్రీకృష్ణుడు, సత్యభామ, రాధ, గోపికల వేషధారణలు వేసి ముచ్చట తీర్చుకున్నారు.

దేశ మనుగడకు దిక్సూచి భగవద్గీత

జుఝవరం(పామర్రు): భగవద్గీత, మహాభారతాలు మన దేశ మనుగడకు దిక్సూచి వంటివని ప్రముఖ గీతా ప్రవచన కర్త ఘంటసాల బసవయ్య అన్నారు. మండలంలోని జుఝవరం గ్రామంలోని శ్రీయోగానంద లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శ్రీకృష్ణ యాదవ్ భక్త బృందం, పామర్రు కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రాత్రి శ్రీకృష్ణ వేదిక వద్ద కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తూ అంతరించిపోతున్న ఆధ్యాత్మికతకు జీవం పోసే విధంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించి ఆదరించాలని కోరారు. అనంతరం ప్రముఖ కూచిపూడి నాట్య గురువు కళారత్న వేదాంతం రాధేశ్యామ్ మహాభారతంలోని కృష్ణ యక్షగానాన్ని ఆలపిస్తూ శ్రీకృష్ణ బోధనను నాట్య రూపకం ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళా పరిషత్ అధ్యక్షుడు ఎస్.త్రివిక్రమరావు, గౌరవ అధ్యక్షుడు పీఎంఎస్ ప్రసాద్, శ్రీకృష్ణ కమిటీ కన్వీనర్ జొన్నలగడ్డ నాగరాజు, కళా పరిషత్ డైరెక్టర్ పామర్తి వెంకట నారాయణ, కొల్లా శ్రీనివాసరావు, కట్టా శ్రీనివాసరావు, తుంగల వేణు, గోపాల ప్రసాద్, సోమవరపు రామారావు, పోతురాజు పాల్గొన్నారు.



భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న గీతా ప్రవచన కర్త ఘంటసాల బసవయ్య

వైభవంగా శాంతి కల్యాణం

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు బుధవారంతో ముగిశాయి. సోమవారం ప్రారంభించిన ఈ ఉత్సవాలు బుధవారం జరిగిన మహాకుంభాభిషేకం, పవిత్రజల సంప్రోక్షణ కార్యక్రమాలతో ముగిశాయి. స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), వీరకుమారి దంపతులు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ముఖ్య అతిథులుగా పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల మాస కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వేదికపై ఉంచి ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో అందంగా అలంకరించి పూజలు చేశారు. ఎమ్మెల్యే దంపతులు, ఎమ్మెల్సీ ఈ కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేసి ఆశీర్వచనాలు పొందారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీ రాచూరి రాధా పాల్గొన్నారు.



సుబ్బారాయుడికి పూజలు

రేపు సామూహిక కుంకుమ పూజ

భావదేవరపల్లి(నాగాయలంక): శ్రావణమాసం ఆఖరి వారాన్ని పురస్కరించుకుని గ్రామంలోని అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ నిర్వహిస్తామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన భక్తులు అమ్మవారికి సారె సమర్పించి మెక్కుబడులు చెల్లించుకుంటారన్నారు.

నేడు ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గూడూరు: గూడూరులోని వెంకటాచల స్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులకు గురువారం ఉదయం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ శంకుస్థాపన చేస్తారని ఆలయ మేనేజర్ టీవీవీ మోహనరావు తెలిపారు. రూ. 30 లక్షల సీజీఎఫ్ నిధులతో ఆలయంలో రాజగోపురం, యాగశాల నిర్మించనున్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

నేడు మడకలో గడప గడపకు మన ప్రభుత్వం

పెడన: మండల పరిధిలోని మడక గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం గురువారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి జరుగుతుందని మంత్రి కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. కార్యక్రమానికి మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని పేర్కొంది.

24న ఉచిత నేత్ర వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి (పెదకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తామని సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మారుతీ విద్యా నికేతన్ పాఠశాల ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు సెల్: 94906 36466, 70936 17778 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

వర్షాలతో ఉపశమనం

చల్లపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. కొద్దిరోజులుగా ఎండల తీవ్రతతో అల్లాడిపోయిన ప్రజలు, రైతులు వర్షాల రాకతో ఉపశమనం పొందారు. బుధవారం తెల్లవారుజామున చల్లపల్లి పరిసర గ్రామాల్లో వర్షాలు కురిశాయి. చల్లపల్లిలో 16.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.